

బాక్సింగ్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రజాహిత కార్యక్రమాలు ప్రతిఒక్కరూ చేపట్టాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గాజులరేగకు చెందిన వైసిపి నాయకులు జమాన శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సొంత నిధులతో వందమంది బాక్సింగ్ క్రీడాకారులకు టి-షర్ట్‌లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజులకు వృథాగా డబ్బు ఖర్చు పెట్టే కంటే, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డోలా మన్మథకుమార్, కార్పొరేటర్లు ఎన్.ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, గాజులరేగ పిఎసిఎస్ అధ్యక్షులు జె.మధు, నాయకులు కనుగుల రాజా, ఎన్ఎస్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు
- బస్సుయాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, పూసపాటిరేగ

ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర మహాసభల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా మందస నుంచి భీమవరం వరకు చేపడుతున్న కార్మిక చైతన్య బస్సుయాత్ర గురువారం జిల్లాలోకి ప్రవేశించింది. పూసపాటిరేగ, డెంకాడ మండలాల మీదుగా విజయనగరం చేరింది. బస్సుయాత్రకు దాసన్నపేట విద్యుత్తు భవనం వద్ద సిఐటియు నాయకులు ఘన స్వాగతం పలికారు. బస్సుయాత్రలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి స్వాగతించారు. అనంతరం బైక్ ర్యాలీతో కోట జంక్షన్ వరకు బస్సు యాత్ర చేరుకుంది. పూసపాటిరేగ మండలం మైలాన్ జంక్షన్, విజయనగరంలోని కోట కూడలిలో ఏర్పాటు చేసిన సభల్లో నర్సింగరావు మాట్లాడారు. అత్యధిక కార్మిక వర్గాల సమస్యలకు ప్రభుత్వ విధానాలే కారణమని తెలిపారు. కార్మికులకు సరైన వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత కరువైందని ఆందోళన వ్యక్తంచేశారు. పిఎఫ్, పింఛను విధానమైతే చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

బస్సుయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న సిఐటియు జిల్లా నాయకులు

కొంతమంది సంపన్నుల కోసమే ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు.

కార్మికుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న చట్టాల స్థానంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకొచ్చేందుకు ఉవ్విళ్లూరుతోందని విమర్శించారు. ప్రతిరోజూ దేశభక్తి జపం చేసే బిజెపి వైజాగ్ స్టీల్‌ప్లాంటును దక్షిణకొరియా కంపెనీ కట్టబెట్టేందుకు సిద్ధమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం ఇవ్వకుండా మోసగిస్తోందన్నారు. కుటుంబం బతకడానికి రూ.26 వేలు కనీస వేతనంగా ప్రభుత్వమే నిర్ణయించి, దాన్ని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం రైళ్లు, పోర్టులు, రక్షణ, విద్యుత్తుతో సహా అన్ని రంగాలను ప్రయివేటుపరం చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ జరిగితే ఛార్జీలు పెరిగి ప్రజలపై భారాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర సంపదను జగన్ ప్రభుత్వం అదానీకి కట్టబెడుతోందని చెప్పారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని దుయ్యబట్టారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించకపోవడంతో కార్మికులు నెలకు రూ.600 కోట్లకు పైగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. ఈ తరుణంలో కార్మికులంతా సంఘటితమై శ్రామికుల కోసం పోరాడానికి కలిసిరావాలని కోరారు. జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జానపద కళాకారులు పాడిన విప్లవ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు, జిల్లా నాయకులు టివి రమణ, రెడ్డి శంకరరావు, యుఎస్ రవికుమార్, బి.సూర్యనారాయణ, ఎ.జగన్మోహన్, బి.రమణ, బి.సుధారాణి, కృష్ణమ్మ, మైలాన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొంతు రాము, జి.అప్పలనాయుడు, రవి, శ్రీను, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- సారికలో 3,600 ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

సొంతిళ్లు కట్టుకోవాలన్న పేదల కలలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. విజయనగరం మండలం సారిక వద్ద రూపొందించిన గృహనిర్మాణ లేఅవుట్‌లో సుమారు 3,600 మందికి పండగ వాతావరణంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీని ప్రారంభించామన్నారు. ప్రజోపయోగం కోసమే రాజకీయాలు చేయడం తమకు మొదటి నుంచీ అలవాటని, నిస్వార్థంగా సేవలను అందిస్తున్నామని అన్నారు. అందువల్లే ఒక సామాన్య కార్యకర్త నుంచి, ప్రజల ఆదరాభిమానంతో తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు ఎన్నో హామీలను ఇచ్చిన చంద్రబాబునాయుడు, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని తెలిపారు. ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చిందని, చేసిన అభివృద్ధే కొలమానం తప్ప, గతంలో మాదిరి కల్లబొల్లి కబుర్లు చెబితే నమ్మే రోజులు పోయాయని కోలగట్ల స్పష్టం చేశారు.

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద లేఅవుట్‌లో ఒకదాన్ని గుంకలాంలో రూపొందించి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేశామన్నారు. సారిక వద్ద సుమారు 120 ఎకరాల్లో 4 వేల ప్లాట్లతో మరో లేఅవుట్‌ను రూపొందించామని వెల్లడించారు. ఒక్కో పేద కుటుంబానికి సుమారు రూ.6 లక్షల విలువైన స్థలాన్ని ఇవ్వడంతోపాటు, వారు ఇళ్లు కట్టుకోడానికి రూ.లక్షా 80వేల ఆర్థిక సాయాన్ని, ఉచితంగా ఇసుకను అందిస్తున్నట్లు చెప్పారు. లేఅవుట్‌లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని జెసి కోరారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి

సభకు అధ్యక్షత వహించిన ఎంపిపి మామిడి అప్పలనాయుడు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు మాట్లాడారు. ఇళ్ల స్థలం కోసం గానీ, ఇంటి నిర్మాణం కోసం గానీ, ఎవరికీ ఒక్క పైసా కూడా లంచం ఇవ్వలేదని, ఇకముందు కూడా ఇవ్వబోమని లబ్ధిదారులతో కోలగట్ల ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ఎస్‌వి రమణమూర్తి, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, తహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఎంపిడిఒ జి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో తేడా వస్తే చర్యలు

ఆర్‌డిఒ శేషశైలజ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ధాన్యం తూకంలో ఎక్కడైనా ఎక్కువ అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ పి.శేషశైలజ తెలిపారు. గురువారం మండలంలోని పారాది, గొర్లిసీతారాంపురంలో రైతు భరోసా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వ ఆదేశానుసారం తేమశాతం, కొలతల్లో తేడాలు లేకుండా కొనుగోలు చేసే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. మిల్లర్లు ఎక్కడైనా ఎక్కువగా తూకం అడిగితే వెంటనే తనకు ఫిర్యాదు చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు, రీసర్వేపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి ఎడి ఎం.శ్యామసుందర్, హెచ్‌డిటి గౌరీ శంకర్రావు, సిఎస్ డిటి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు

విద్యుత్తు అధికారుల కక్ష సాధింపు

ప్రజాశక్తి-బాడంగి

నేరుగా కలిపేసిన విద్యుత్తు కనెక్షన్

విద్యుత్తు శాఖ అధికారులు తనపై, తమ గ్రామస్తులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు ఆరోపించారు. గురువారం ఎరకలపాకలు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తన ఇంటికి విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో ఆ శాఖపై హైకోర్టుకు వెళ్లడంతోపాటు ఎస్‌టిలమనే చిన్నచూపుతో వేధింపులకు దిగుతున్నారని వాపోయారు. ఈ నెల 27న తమ గ్రామానికి వచ్చిన విద్యుత్తు శాఖ ఎఇ, సిబ్బంది.. 'మీ ఇంటికి కరెంటు లేదని హైకోర్టుకు వెళ్లారు కదా! ఆ మీటరు ఎక్కడుందో చూపించండి' అని అడిగారని తెలిపారు. అనంతరం గ్రామానికి విద్యుత్తు సరఫరా వచ్చే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మెయిన్ వైర్‌ను డైరెక్ట్ చేసి, ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారని తెలిపారు. దీనివల్ల గ్రామంలో మోటార్ల వద్ద ఎర్త్ అయ్యి, ఒక మోటార్ కాలిపోయిందని చెప్పారు. ట్రాక్టరు వెళ్లడం వల్ల ఒక ఇంటి సర్వీసు వైరు తెగిందని, అది బాగుచేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్తే, మెయిన్ వైర్ డైరెక్ట్ చేయడం వల్ల హెల్పర్ మరమ్మతు చేయలేకపోయారని తెలిపారు. దీంతో ఆ కుటుంబం 3 రోజులు నుంచి కరెంటు లేక అంధకారంలోనే ఉంటోందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్తు తీగలపై కొబ్బరిమట్ట పడటంతో మంటలు చెలరేగాయని, దీంతో స్థానికులు భయంతో పరుగులు తీశారని తెలిపారు. హైకోర్టుకు వెళ్లి విద్యుత్తు శాఖపై కేసు వేశామనే కక్షతో తమకు ప్రాణహాని జరగాలని ఇలా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైసిపికి వాలంటీర్లు, కన్వీనర్లే కీలకం

మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-రేగిడి, గరివిడి

మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి వాలంటీర్లు, కన్వీనర్లే కీలకమని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. గురువారం రాజాం మండలం కంచరాం వద్దనున్న తృప్తి రిసార్ట్‌లో ఎమ్మెల్యే కంబాల జోగులు, చీపురుపల్లిలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన వైసిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. చీపురుపల్లిముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్షని అన్నారు. రానున్న ఎన్నికలలో సంక్షేమ పథకాలే పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని తెలిపారు. ఆ దిశగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి సచివాలయ పరిధిలో కన్వీనర్ల నియామకం చేపట్టామని వెల్లడించారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు అందజేసే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2750కి పెంచినట్లు తెలిపారు.

అనంతరం జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, రాజాం నియోజకవర్గ పరిశీలకులు పేడాడ తిలక్, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజా రంజక పాలన చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక దుష్ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు. వీటిని సోషల్ మీడియాలో ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఉమ్మడి శ్రీకాకుళం వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైస్ ఎంపిపిలు అచ్చెన్నాయుడు, వి.జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై జనసేన ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్నా చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

పింఛన్ల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద జనసేన ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవ్వతాతలు, వితంతువులు, వికలాంగుల పింఛన్లు తొలగించేందుకు మనసెలా వచ్చిందని సిఎం జగన్‌ను ప్రశ్నించారు. పేదల పింఛన్లు తొలగించిన నాయకులు రాజకీయాల్లో ఎలా ఉండగలుగుతున్నారని నిలదీశారు. అంత మంది పింఛన్లను తొలగించి ఏ విధంగా గడపగడపకు వెళ్తున్నారని నిలదీశారు. అనంతరం డిఆర్‌ఒ గణపతిరావుకు వినతి అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వీరమహిళ మాతా గాయత్రి, సీనియర్ నాయకులు రవికుమార్ మిడతాన, దంతులూరి రామచంద్రరాజు, మోపాడ అనిల్, మజ్జి శంకర్, రవిరాజు చౌదరి, హుస్సేన్‌ఖాన్, వాసు, సూర్యారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కందుకూరు ఘటనపై విచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నెల్లూరు జిల్లా కందుకూరులో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సభలో తొక్కిసలాట ఘటనపై ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు విచారం వ్యక్తంచేశారు. టిడిపి కార్యకర్తల మృతికి స్థానిక అశోక్ బంగ్లాలో గురువారం అశోక్‌తోపాటు పార్టీ నాయకులు నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతుల కుటుంబ సభ్యులకు అశోక్ సంతాపం తెలిపారు. టిడిపి కుటుంబ సభ్యులను కోల్పోవడం తీరనిలోటని ఆ పార్టీ విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చదువు, క్రీడల్లో రాణించాలి

ఎస్ఇబి సిఐ జైభీమ్

పోటీలను ప్రారంభిస్తున్న సిఐ జైభీమ్

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ కోరారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడి 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజా కళాశాల మైదానంలో గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేసి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాలీబాల్ పోటీలను సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని కోరారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు సురేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ పోరాటాలతో పాటు సామాజిక కార్యక్రమాలలో ఎస్ఎఫ్ఐ ముందుంటుందని చెప్పారు. వాలీబాల్ పోటీలకు జిల్లాలో నలుమూలల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శివ, నాయకులు వాసు, డేవిడ్, తేజ, జానీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

అధునాతన వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. మిషన్స్ స్మైల్, కాల్గేట్ పామోలివ్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న గ్రహణం మొర్రి శస్త్రచికిత్సల ఉచిత వైద్య శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రహణం మొర్రి బాధితులకు శస్త్ర చికిత్సలు అందు బాటులోకి రావడం వారి జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు. కాల్గేట్ పామోలివ్, మిషన్స్ స్మైల్, తిరుమల మెడికవర్ వంటి సంస్థలు గ్రహణం మొర్రి బాధితులకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడం పట్ల అభినందించారు. డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ శిబిరంలో 50 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్, రఫీ, డాక్టర్ మహేశ్వరరావు, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ పి.ఎస్.వి.రామారావు, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రావణి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ కుష్బు, స్టాఫ్ అడ్మిన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ అప్పలనాయుడు

పెల్లుబికిన ప్రజా ఉద్యమాలు

- అన్నదాత జీవన పోరాటం
- పనిదినాలు పెంచాలంటూ ఉపాధి కూలీలు
- ఉద్యమ బాటలో విద్యార్థి లోకం
- విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు
- ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- పెరిగిన ధరలు తగ్గించాలని సాధారణ ప్రజానీకం

ప్రభుత్వ విధానాలపైనా, నిర్లక్ష్య వైఖరిపైనా, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడంపైనా గడిచిన ఏడాదిలో ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా సంఘాల పోరాటాలు పెల్లుబికాయి. కొన్ని రంగాలకు చెందిన సమస్యలపై చేపట్టిన నిరసనల హోరు గల్లీ నుంచి ఢిల్లీకి తాకింది. ముఖ్యంగా అందరికీ అన్నంపెట్టే రైతులు జీవన పోరాటం చేశారు. పనిదినాలు పెంచాలంటూ ఉపాధి కూలీలు.. స్కూళ్లను పరిరక్షించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు.. నిరుద్యోగ సమస్యలపై డివైఎఫ్ఐ.. లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని కార్మిక లోకం.. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలంటూ స్కీమ్‌వర్కర్లు... ఇలా ఒకటేమిటి? విజయనగరం ఉమ్మడి జిల్లాలో అన్ని తరగతులు, విభాగాలకు చెందిన ప్రజానీకం గళం విప్పుతూ రోడ్లపైకి వచ్చాయి.



ప్రజా, కార్మిక సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు, ప్రజలు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో అందరికీ అన్నంపెట్టే రైతన్న జీవన పోరాటం చేయాల్సి వచ్చింది. విత్తనాలు మొదలుకుని పెంచిన ఎరువులు, పురుగుల మందుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయం కల్పించాలని కోరుతూ పెద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సుజల స్రవంతి కాలువ నిర్మాణంలో రైతులకు జరిగే నష్టాన్ని తగ్గించి, ప్రభుత్వ భారాన్ని కూడా తగ్గించాలంటూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా, రాస్తారోకోలు చేపట్టారు. గ్రామసభలను రైతులు అడ్డుకున్నారు. భీమసింగి, ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమలను తెరిపించి, చెరకు రైతులకు మద్దతుధర కల్పించాలని సంఘం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించింది. సాలూరు, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో పెత్తందారుల ఆక్రమణలో ఉన్న భూమిని పేదలకు పంచాలని ఎపి గిరిజన సంఘం పోరాడింది. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక కుటుంబానికి 10 ఎకరాల వరకూ పోడు పట్టాలు ఇవ్వాలంటూ చేపట్టిన పోరాటం సుదీర్ఘకాలంగా సాగుతోంది. చాలా చోట్ల గిరిజనులకు పట్టాలు ఇప్పించడంలో సంఘం పాత్ర ఎనలేనిది. సాలూరు, మక్కువ, పార్వతీపురం, పాచిపెంట, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో భూ సమస్యలపై పోరాటం సాగుతోంది. ఉపాధి కూలి రేట్లు, పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం నిరసనలు చేపట్టింది.

హక్కుల పరిరక్షణకు..

కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు సిఐటియు ఆధ్వర్యాన ఎన్నో పోరాటాలు చేశారు. పోరాటాల ఫలితంగా విజయనగరం డాబాతోట కళాసీలు, సిమెంట్ కళాసీలు, జిసిసి సబ్బుల యూనిట్ కార్మికులకు ఈ కాలంలో వేతన ఒప్పందాలు జరిగాయి. రెండో ఎఎన్ఎం, విఆర్ఎలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలో కార్మికులు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. ఈ పోరాటాలన్నింటిలోనూ వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం వెన్నంటి ఉంది. ప్రతిపక్ష పార్టీ ప్రజా సమస్యలు, ముఖ్యంగా స్థానిక సమస్యల పరిష్కారం కన్నా అధిష్టానం పిలుపులను అందుకోవడానికే సరిపోయింది. బిజెపి కుల, మతాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించింది.

ఉద్యమాల బాటలో విద్యార్థులు

కరోనా కారణంగా మూతపడిన వసతిగృహాలను విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి తెరిపించాలని జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఫలితంగా రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా మన జిల్లాలో విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే హాస్టళ్లు తెరుచుకున్నాయి. పోరాట ఫలితంగా మెనూ అమలు మెరుగుపడింది. నూతన విద్యావిధానం పేరిట ప్రాథమిక పాఠశాలల మూసివేతపై జిల్లా అంతటా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భాగస్వామయ్యారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 86 స్కూళ్లను ప్రభుత్వం యథాతథంగా కొనసాగించడం తప్పలేదు. ఎన్ఇపిని రద్దు చేయాలని జిల్లాలో సాగిన బస్సుయాత్ర సందర్భంగా 40 మందిని పోలీసులు అరెస్టు చేసినా యాత్ర నిరాటంకంగా సాగింది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వ రంగంలోకి విలీనం చేయడం లేదా యథాతథంగా నడపాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఎస్ఎఫ్ఐ ఉద్యమించింది. ఎంఆర్ (ఎ) కాలేజీ, కోటలోని ఎంఆర్ కాలేజి రక్షణ కోసం పెద్దఎత్తున ఉద్యమించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఉపాధ్యాయులు, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని రెండు సార్లు చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఫలితంగా చాలా వరకు సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు గాలికి వదిలి, పెద్దఎత్తున పుస్తకాలు పేరుతో వ్యాపారం మొదలు పెట్టడాన్ని ప్రతిఘటించింది. ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో ఫీజుల పెంపు, కాండినేషన్ పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టడం వంటి సందర్భాల్లో ఎస్ఎఫ్ఐ నాయకత్వం ఎక్కడికక్కడ స్పందించి విద్యార్థులకు ఆసరాగా నిలిచింది. ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ కలిసికట్టుగా నిరుద్యోగుల సమస్యలపై పెద్దఎత్తున పోరాడాయి. నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యాలని, ఖాళీపోస్టులు భర్తీకి పెద్ద ఎత్తున అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు మునుపెన్నడూ లేనంతగా రోడ్లపైకి వచ్చారు. ముఖ్యంగా పిఆర్‌సి కోసం నిర్వహించిన చలో విజయవాడ సహా జిల్లాలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో వేలాది మంది భాగస్వామ్యమయ్యారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న జస్టిస్

చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివి

త్రిపుర చీఫ్ జస్టిస్ టి. అమర్‌నాథ్ గౌడ్

కొత్తవలస : గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు మరువలేనివని త్రిపుర చీఫ్ జస్టిస్ టి. అమర్నాథ్ గౌడ్ అన్నారు. ఆయన గురువారం సాయంత్రం మంగళపాలెం వద్ద గల శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్‌ను సందర్శించారు. ముందుగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్ బాబు, ట్రస్టు ద్వారా ఏ సేవలు పేద ప్రజలకు, వికలాగులకు అందిస్తున్నారో తెలియజేశారు. అనంతరం చీఫ్ జస్టిస్ అమర్నాథ్ గౌడ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో, ఇటువంటి సేవలు అందించడం చాలా సంతోష కరమన్నారు. ఆపదలో ఉన్న పది మందికి సహాయం చేయడం ఎంతో అవసరమని మనం ఇతరులకు సహాయం చేయడం వల్ల, కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని అన్నారు. తాను హైదరాబాద్ కోర్టులో జడ్జిగా వృత్తి చేసేటప్పుడు గీత కార్మికుల కేసులు ఎక్కువగా చేశానని గుర్తు చేశారు. కోర్టులో పెండింగులో ఉన్న 88 వేల ఇతర కేసులు పరిష్కరించానని అన్నారు. తాను త్రిపుర చీఫ్ జస్టిస్‌గా నియామకం అయిన కొద్దీ రోజుల్లోనే అనేక కేసులు పరిష్కరించానన్నారు. అనంతరం వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించారు. ఈ కార్యక్రమంలో గిసాన్ కర్మాగారం ఎమ్‌డి రాజు, ఆదర్శ్, ఇమంది శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భక్తుడు విరాళం

శృంగవరపుకోట : పుణ్యగిరి వద్ద ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సారధ్యంలో నిర్మితమవుతున్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనుల నిమిత్తం అహోబిలం చిన్న జీయర్ స్వామి మఠానికి చెందిన భక్తుడు ఎం.వి రమణమూర్తి చెక్ రూపంలో ఇచ్చిన విరాళాన్ని చిన్న జీయర్ స్వామి ఇందుకూరి రఘురాజుకి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి ఆలయ పనులను పర్యవేక్షించి, నిర్మాణ కమిటీకి సూచనలను జారీ చేశారు. ముందుగా చిన్న జీయర్ స్వామి బొడ్డవరలో గల ఎమ్మెల్సీ రఘురాజు గృహానికి వెళ్లారు. అనంతరం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ బర్తాపురంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంను సందర్శించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి భగవంతుని ప్రవచనాలు, ధనుర్మాస ప్రత్యేకతలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపిటిసిలు బొడ్డేటి ఆదిలక్ష్మి, వాకాడ సింహాచలం, మజ్జి దేవి, దారగిరి, వార్డు మెంబర్లు సూరిబాబు, అర్జున, కృష్ణవేణి, మాజీ సర్పంచులు బుజ్జి, వశి వెంకటరావు, మాజీ ఎంపిటిసి తలారి శ్రీను, నాయకులు అప్పలరాజు, మోపాడ గౌరినాయుడు, రామకృష్ణ, మోపాడ శ్రీను, వాకాడ రమణ, గంగరాజు, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు మృతులకు సంతాపం

వేపాడ : మండలంలోని కెఆర్ పేట గ్రామంలో ఎన్ఆర్ఐ, టిడిపి నాయకులు గొంప కృష్ణ ఆధ్వర్యంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గొప్ప వెంకటరావు, మండల మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతిలు కందుకూరి ఘటనలో మృతులకు గురువారం సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జాగరపు పెదరామనాయుడు, జనపరెడ్డి ఈశ్వరరావు, సిరికి రమణ, సిరికి సూర్యనారాయణ, సేనాపతి గణేష్, సేనాపతి అప్పారావు, గొర్లె నాగరాజు, తాడి కృష్ణ, ఎర్ర ప్రగడ సూర్యం, మంచిన అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి తిరుప్పావడ సేవ

వేపాడ : మండల కేంద్రంలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం వైభవంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి వెంకట చిరంజీవి ప్రసాద్ మంత్రోత్సవాలతో స్వామి వారికి విశేష పూజలు అలంకరణ నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి పులిహోర, మధుర ఫలాలు, స్వీట్లు, పలు రకాల పువ్వులతో తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఎస్ కోట, ఆనందపురం, నీలకంఠరాజపురం, బి.వి.పాలెం, చిన్న గుడిపాల, వేపాడ వల్లంపూడి, దబ్బిరాజుపేట తదితర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని తిరుప్పావడ సేవను తిలకించి స్వామి దర్శనం చేసుకున్నారు.

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

పల్సర్ బైక్ షోరూం ప్రారంభం

వేపాడ : వేపాడ కొత్తవలస ప్రధాన రహదారిలో ఎంపిపి డి. సత్యవంతుడు ఏర్పాటు చేసిన పల్సర్ బైక్ షోరూమ్‌ను స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నక్కల నాయుడు బాబు, డిసిసిబి చైర్మన్ వివి చిన్న రామునాయుడు, ఎల్‌కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో ఆకస్మికంగా తనిఖీలు.

రేగిడి : మండలంలోని పారంపేట, అంబాడ, కోడిశ గ్రామాల్లో రైస్ మిల్లులను గురువారం డిప్యూటీ తహాశీల్దార్ బి.గోవిందరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. రైతు భరోసా కేంద్రాల నుంచి మిల్లులకు చేరిన ధాన్యం నిల్వలను, వాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతు భరోసా కేంద్రం నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం అన్ లోడింగ్ త్వరితగతిన చేయాలని సూచించారు. ట్రాక్టర్లు, లారీలతో వచ్చిన ధాన్యాన్ని తేమ శాతం పరిశీలించి, అన్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు మిల్లర్ల వద్దకు వెళ్లి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫిర్యాదు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. ఈయనతోపాటు విఆర్‌ఒలు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరావు మాస్టారు మృతి

వేపాడ : మండలంలోని వల్లంపూడి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు గోరు వెంకటరావు గురువారం మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన ఇంటి వద్ద మృతి చెందాడు. నిస్వార్ధపరుడు, నిరాడంబర జీవితాన్ని గడిపిన మనస్తత్వం కలిగిన వ్యక్తి మరణించడంతో ఉపాధ్యాయ లోకానికి తీరని లోటుగా చెబుతున్నారు. ఆయన మృత దేహం వద్ద యుపిఎస్ యూనియన్ నాయకులు, పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వెంకటరావు(ఫైల్)

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం

బొబ్బిలి : మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఇంటింటా ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం ముద్రించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. మూడేళ్లలో వారికి అందించిన పథకాలను వివరించారు. కుల, మత, పార్టీలు ఏవి చూడకుండా పారదర్శకతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు చేర్చిన ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పట్లో ఎన్నికలు లేవని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని తెలుసుకునేందుకు మాత్రమే వచ్చామన్నారు. టిడిపి హయాంలో అప్పటి పాలకులు ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించేవారని, వారికి తమ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురికి స్థలాలు

- ఇంకా స్థలాలు అందని పేదలెందరో..
- ఎస్.కోట వారికి గంట్యాడ మండలంలో స్థలాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తామని అన్నట్లే అర్హత కూడా చూడకుండా జగనన్న లేఔట్లలో ఇళ్ల స్థలాల పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లక్షల ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినప్పటికీ నిలువ నీడ లేక ఇంకా రోడ్ల మార్జిన్లవద్ద, చెరువు గట్ల మీద గుడిసెలు వేసుకుని జీవించేవారు ఇంకా ఆ గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారంటే జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ ఎంత పారదర్శకంగా జరిగిందో ఇట్టే అర్థమవుతోంది. వడ్డించేవాడు మనవాడైతే కడబంతిలోనున్న అన్ని సమకూర్తాయన్న సామెత మాదిరిగా పక్క మండలంలో ఉన్న వారికి కూడా ఇక్కడ ఇళ్ల స్థలాలు సమకూరడంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఒకే కుటుంబానికి చెందిన నలుగురుకు ఇళ్ల స్థలాలు కేటాయించడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

మండలంలోని ఇల్లు లేని ప్రతి పేదవానికి సొంతింటి కల నెరవేర్చాలని సంకల్పంతో అధికారులు స్థలాలను సేకరించి లేఔట్లను వేసి అర్హులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా జగనన్న లేఅవుట్లలో ఇప్పటికే ఇల్లు ఉన్నవారికి, ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురు కుటుంబ సభ్యులకు వేర్వేరు జగనన్న లేఔట్లలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఉదాహరణకు ఎస్‌కోట మండలంలోని ముషిడి పల్లి సచివాలయ పరిధిలో జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ కోసం సర్వే నంబర్ 35/4లో జల వనరుల శాఖకు చెందిన కొంత భూమిని అధికారులు తీసుకొని లేఅవుట్ వేసి అందులో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమార్తెకు రెండు స్థలాలు కేటాయించారు. గంట్యాడ మండలం, తాటిపూడి రెవెన్యూ గ్రామంలో హైవేకు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 21లో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు జల వనరుల శాఖకు చెందిన స్థలాన్ని తీసుకొని అందులో మూడు సెంట్లు స్థలాన్ని అదే కుటుంబానికి చెందిన తండ్రికి ఇచ్చారు. అతనిది ఆ మండలం కాకపోయినా అక్కడ ఎటువంటి ఆధారం లేకపోయినా స్థలం కేటాయించడంతో ఆయన దర్జాగా ఆ మూడు సెంట్లు స్థలంలో డూప్లెక్స్ హౌస్ నిర్మించుకుంటున్నాడు. ఇది ఎలా ఉండగా పట్టణంలోని 168 సర్వే నంబర్‌లో ఉన్న జగనన్న కాలనీలో అతని కోడలకు మరో ఇంటి స్థలాన్ని కేటాయించారు. ఈ రకంగా ఆ కుటుంబంలో ఒక వ్యక్తికి చెందిన తల్లి,దండ్రి, చెల్లి,భార్య పేరిట నాలుగు స్థలాలను సొంతం చేసుకున్నారు. అధికారులు కేవలం ఆ కుటుంబంతో లాలూచీ పడి ఇలా స్థలాలను కేటాయించారని, దీని వల్ల నిజమైన పేదలకు స్థలాలు లేకుండా పోతున్నాయని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాటిపూడిలో నిర్మిస్తున్న డూప్లెక్స్ ఇల్లు ఇదే...

నిరుపేదలకు బెదిరింపులు

తాటిపూడి గ్రామంలో పేదలకు స్థలాలు ఇవ్వకుండా ఒకే వ్యక్తికి మూడు సెంట్లు స్థలం కేటాయించడంపై అక్కడ పేదలు వ్యతిరేకించగా స్థానిక నాయకులు వారిని బెదిరించినట్లు తెలిస్తోంది. ఈ విషయంలో రోడ్డెక్కితే భవిష్యత్తులో మీకు స్థలాలు రాకుండా అడ్డుకుంటామని నాయకులు వారిని బెదిరించినట్లు పేదలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేదలైన తమను ఆదుకుని స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు.

ఈ విషయమై ఇటీవల మదనాపురం సచివాలయ పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ సూర్యకుమారికి ఈ విషయమై వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే ఎంతటి వ్యక్తిపైనైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

మండలంలోని పోతనపల్లి ఎరుకలిపేటలో ఇంకా పది కుటుంబాలు ఇండ్లు లేక రోడ్ల పక్కనే గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇళ్ల స్థలాలు అడిగితే రెండో లిస్టులో పెట్టాం వస్తాయని అంటున్నారు. మొదటి విడతలో ఇచ్చిన ఇళ్ల స్థలాల పంపిణీలో అవకతవకలు జరిగాయి. ఎక్కువగా ఇల్లు, పొలాలు, ఆస్తులు ఉన్న వారికే ఇచ్చారు. అసలైన నిరుపేదలకు రెండో విడతలో ఇస్తామని అంటున్నారు.

గేదల పోతయ్య,
పోతనపల్లి మాజీ సర్పంచ్.

దళారులే ముందు..

- ట్రక్ చీటీల విషయంలో వారికే పెద్దపీట
- ఆర్‌బికెల వద్ద రైతుకు తప్పని పాట్లు

ప్రజాశక్తి - గుర్ల

దళారులే ముందు...రైతులు తరవాత.. ఇది గుర్ల రైతు భరోసా కేంద్రంలో ట్రక్ చీటీలు జనరేట్ చేస్తున్న సిబ్బంది తీరు. రైతు ధాన్యం విక్రయించాలంటే రైతు భరోసా కేంద్రంలో ట్రక్ చీటీ జనరేట్ చేయాలి. సంబంధిత టిఎలు ఏ మిల్లు పేరు చెబితే ఆ మిల్లుకు రైతు తన ధాన్యాన్ని తరలించాల్సి ఉంది. అయితే ఆర్‌బికెల్లో రైతుల కంటే దళారులకే ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ట్రక్ చీటీల కూడా గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుందని దళారులు తీసుకొచ్చిన దాన్యానికి ముందు ట్రక్ చీటీలు ఇస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ఇదంతా గూడెం పిఎసిఎస్ అధికారులు కనుసన్నలలో జరుగుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికారులు పనిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ట్రాక్టర్లు నెంబర్లు వారే వేస్తున్నారు..?

ఆర్‌బికెల్లో టిఎలు ట్రక్ జనరేట్ చేసినపుడే రైతు తీసుకొచ్చిన ట్రాక్టర్ నెంబర్‌ను కూడా అందులో పొంది పరచాలి. అలా చేస్తేనే తరువాత ప్రభుత్వం నుంచి రావాల్సిన రవాణా ఛార్జీలు రైతు ఖాతాలో పడతాయి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. ట్రక్ చీటీ జనరేట్ చేసినపుడు రైతులు చెప్పిన ట్రాక్టర్ నెంబరు కాకుండా వారి వద్ద ఉన్న ట్రాక్టర్ నెంబరు వేసి చీటీ జనరేట్ చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వం నుంచి రావాల్సిన రవాణా ఛార్జీలు రైతుల ఖాతాలకు పడకుండా వారు పొంది పర్చిన నెంబరకు వెళతాయి. దీంతో రైతు పూర్తిగా మోసపోతాడు. రవాణా ఛార్జీల, లోడింగ్, అన్‌లోడింగ్ ఛార్జీలు రైతులు భరించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. అలా కాకుండా తాము తీసుకొచ్చిన ట్రాక్టర్ నెంబర్‌నే ట్రక్ చీటీలో పొందిపరచాలని రైతులు కోరుతున్నారు. కాగా కొంత మంది రైతులు తమ ధాన్యం కొనాలని సిబ్బంది వద్దకు వెళుతున్నా పట్టించుకోవడం లేదని కనీసం గోనె సంచులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. కానీ దళారులు తెచ్చిన ధాన్యాన్ని మాత్రం వెంటనే తీసుకుని మిల్లులకు పంపిస్తున్నారని దళారులకు ఈ క్రాప్ నిబంధనలు వర్తించవా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఈ విధంగా జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పరిస్థితి ఏంటని గుర్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రక్ చీటీ వ్యవహారంలో అవకతవకలకు పాల్పడుతున్న ఆర్‌బికె సిబ్బందిపై తగు చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

కళ్లాల్లోనే ఉన్న ధాన్యం

సిబ్బంది తీరు బాగోలేదు

ఆర్ బి కె ల్లో సిబ్బంది రైతు పట్ల వ్యవహరిస్తున్న తీరు బాగోలేదు. ట్రక్ చీట్‌ల వ్యవహారం ఇబ్బందిగా ఉంది. దళారులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఆర్‌బికెలకు వెళ్లలంటే వెనుకడుగు వేస్తున్నాం. దీంతో ఇంకా కళ్లాల్లోనే దాన్యం ఉన్నాయి. ట్రాక్టర్ నెంబర్లు కూడా మేం ఇచ్చినివి కాకుండా వారికి నచ్చినవి వేస్తున్నారు.

- పాదిలాపు గోపి, రైతు గుర్ల

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి- మెంటాడ

ప్రకృతి వ్యవసాయంలో అధిక లాభాలు ఉన్నాయని ఎఒ కె.గోకుల్ కృష్ణ అన్నారు. గురువారం మెంటాడ గ్రామ రైతులతో ఆయన ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. ఇప్పటికే మండలంలో మొక్కజొన్న పంటను 720 ఎకరాలలో పండిస్తున్నారని అందరూ కూడా జీరో టిల్లింగ్ పద్ధతిలో పండించి, భూ సారాన్ని కాపాడుతున్నారని చెప్పారు. దీని ద్వారా పంట ఉత్పత్తి ఖర్చును కూడా తగ్గించారని, పంట కాలాన్ని కూడా 15 రోజుల ముందుకి తీసుకొస్తున్నారని వివరించారు. రైతులంతా ఆధార్‌ను ఫోన్ నంబర్‌కు లింకు చేసుకోవాలని సూచించారు. తృణ ధాన్యాలు విలువ గురుంచి వివరిస్తూ, వాటి దిగుబడి, మార్కెట్ విలువ, ఆరోగ్యం పెంపొందించుకోవడానికి వాటిని రైతులు పండించి ఆహారంగా స్వీకరించాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది చాపాను హేమంత్, బి శ్రీనువాసురావు, మోహన్ రావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గోకుల్

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - భోగాపురం

రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే టిడిపితోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బంగారురాజు అన్నారు. ఇదేమి కర్మ-మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండలంలోని చాకివలస పంచాయతీలో గురువారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక బాలన సాగుతుందని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతిని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పతివాడ అప్పలనాయుడు, దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు, కోరాడ తాతారావు, కర్రోతు రాజు, రామసూరి, లెంక రామనర్సి, నడుపూరు పాపునాయుడు, నడుపూరు లక్ష్మణ, బియ్యాల అప్పలనాయుడు, నడుపూరు ఈశ్వరరావు, పాలపర్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు అప్పులు చేసి బ్రతుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. గురువారం పట్టణంలోని బర్మా కాలనీ, ధర్మవరం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంక్షేమం పేరు చెప్పి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటున్నారన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ మోతలతో సామాన్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిపి రెడ్డి వెంకన్న, నాయకులు నానిగిరి రమణాజి, కే.మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, అల్లూరి సత్తిబాబు రాజు, కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, ఆడారి రమేష్, ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసియ్య, లగుడు తిరుపతి, న్యాయవాది మండా మేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు బర్మకాలనీ, ధర్మవరం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

పూసపాటిరేగ : దగాకోరు ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని టిడిపి నియోజకవర్గ నాయకులు పతివాడ తమ్మునాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చింతపల్లిలో టిడిపి మండల పార్టీ అద్యక్షలు మహంతి శంకరావు అధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ప్రచార కార్యాక్రమం జరిగింది. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఈ ప్రభుత్వ, ఈ ముఖ్యమంత్రి చేస్తున్న ప్రజా వ్యతిరేఖ పాలనపై ప్రజలకు వివరించారు. నిత్యావరసర ధరలు, నిరుద్యోగ సమస్య, కరెంటు సమస్య, మద్యపానం, ఇసుక మాఫియా, తాగునీటి సమస్య, అవినీతి, గిట్టుబాటు ధర, రోడ్లు, కాలువలు లేకపోవడం, మహిళా భద్రత తదితర అంశాలను అడిగి తెలుసు కున్నారు. ఆయనతో పాటు టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు విక్రం జగన్నాధం, రాష్ట్ర కార్యదర్శి మైలపల్లి సింహాచలం, ఎంపిటిసి మైలపల్లి తాత, అమ్మోరమ్మ, నాయకులు ఇజ్జురోతు ఈశ్వర్రావు, కొత్తకోట వెంకటరమణ, బొంతు రవి, చందక ఆనందరావు, మహంతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'సత్య'లో వర్క్‌షాప్

విజయనగరం : సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సెక్యూరిటీస్ మార్కెట్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్, కోటక్ సెక్యూరిటీలలో ట్రైనర్‌గా ఉన్న ఎం.శ్రీను రిసోర్స్ పర్సన్‌గా విద్యార్థులకు ఆర్థికరంగం ప్రాముఖ్యత, పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు కెరీర్ అవకాశాలు, దీర్ఘకాల ప్రయోజనాలను సూచించారు. డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో పెట్టుబడి ప్రాముఖ్యతను వివరించారు. వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, కామర్స్ అధ్యాపకులు కెప్టెన్ ఎం.సత్య వేణి, ఆర్.శ్రీనివాస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిసోర్స్‌పర్సన్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్

బంటుపల్లిలో గడపగడపకు..

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బంటుపల్లి గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయం ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం బంటుపల్లిలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపిలు తమ్మినాయుడు, కూరాకుల అనిత, సర్పంచ్ చిక్కాల హేమలత, వైసిపి నాయకులు చిక్కాల జనార్ధనరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు ఎంపిడిఒ డిడి. స్వరూపారాణి, తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మెంటాడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. మెంటాడ గ్రామ సచివాలయంలో 3వ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గడప గడపకు తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేస్తే వాటిని సంబంధిత అధికారులకు వివరించి తక్షణమే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపిటిసి పతివాడ కుమారి, సిరిశెట్టి నారాయణ రావు, పాండ్రంకి సన్యాసిరావు, దంతులూరి వెంకట చిట్టి రాజు, నామినేటెడ్ డైరెక్టర్లు, చైర్మన్‌లు పాల్గొన్నారు.

డెంకాడ: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పోరాటంలోనే కాదు సేవ కార్యక్రమాల్లో కూడా ముందుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె. రవి కుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా 40వ వసంతోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కళ్యాణి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంపును ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి. కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవి కుమార్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆవిర్భవించి 52 సంవత్సరాలు గడిచి 53వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని, ఈ 52 ఏళ్ల కాలంలో ఎన్నో మైలురాళ్లను దాటుకుంటూ, ఎన్నో పోరాటాలలో ఎందరో నాయకులను కోల్పోతూ, విద్యారంగంలో వచ్చే సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనుపమ దేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి. చినబాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, రమేష్, నాయుడు, మనోహర్, నవీన్, బాలాజి, ముత్యాలు పాల్గొన్నారు.

వేపాడ : ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బక్కునాయుడు పేట మోడల్ స్కూల్లో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె. రవికుమార్, ఎం. హర్ష మాట్లాడుతూ విద్యా వ్యవస్థని నాశనం చేసే నూతన విద్యా విధానం రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య రంగాన్ని నాశనం చేసే విధంగా పలు నిర్ణయాలు తీసుకుంటున్నాయన్నారు. విద్యార్థులకు అన్యాయం చేసే ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన నిధులు పెండింగ్ పెట్టడం విద్యారంగం పై చిన్న చూపు చూడడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మనోహర్, నవీన్, అనిల్, పెద్ద ఎత్తున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిటిసి పిల్లా లక్ష్మి చేతులు మీదుగా గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను వినియోగించుకుని ఉన్నతమైన విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, సిఆర్‌పి కోటీశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కొండవెలగాడ జిల్లా పరిషత్తు పాఠశాలలో 62 మంది విద్యార్థులకు జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు చేతులు మీదుగా గురువారం ట్యాబ్‌ల పంపిణీ చేశారు. జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు చదువుకున్న విద్యార్థులంటే అమితమైన ప్రేమని దీనిలో భాగంగా పాఠశాలను అభివృద్ధి చేశానన్నారు. టెక్కలి, చంద్రంపేట విద్యార్థులు నడిచి వెళ్ల కుండా వారికి కావాల్సిన రవాణా ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి. విక్టోరియా రాణి, తుమ్మల పేట పిఎంసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, చంద్రంపేట, చినబూరాడ పేట, పెదబూరాడపేట వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వేపాడ: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి, తదితరులు

మెంటాడ: మండలంలోని ఆంధ్ర ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ సారా భీమరావు ఆధ్వర్యంలో గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తుందన్నారు. న్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు కె. నీలకంఠం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సవరవిల్లి కొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాబ్స్‌ను వైస్ ఎంపిపి దంతులూరి సూర్యనారాయణ రాజు (రావాడ బాబు), గ్రామ సర్పంచ్ అపరిభుక్త పైడినాయుడు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని బి. శైలజారాణి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి.. విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం తెంటు సత్యం

బొబ్బిలిరూరల్ : మండలంలోని పక్కి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిపి శంబంగి లక్ష్మి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు, ప్రధానోపాధ్యాయులు జివిఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని భీమవరం పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తెంటు సత్యం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్.తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.